సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



మూషికాలతో ముప్పు


మూషికాలు అన్నదాతను ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో ఈ సమస్య మరీ తీవ్రంగా మారింది. - 10లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి ఆలయం వద్ద వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఎం.శివ, సత్యవతి దంపతులు (బొమ్మూరు) రూ.50 వేల విరాళం అందించారు.

97 వేల క్యూసెక్కుల జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి సోమవారం సాయంత్రం 97,825 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.80 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు తుది గడువు 15

రాయవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15 తుది గడువుగా నిర్ణయించారు. ఎస్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ సీ.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించడానికి ఈ నెల 17 తుది గడువుగా నిర్ణయించారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలుగా ఉండాలి. పరీక్ష రాసుకునేందుకు దరఖాస్తు చేసుకునే వారు విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే సమయంలో ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదు. అయితే పరీక్ష రాసే సమయానికి అన్ని ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50గా నిర్ణయించారు.

మైసూర్‌కు దసరా ప్రత్యేక బస్సు

రావులపాలెం: దసరాకు మైసూర్ ప్రత్యేక బస్సు యాత్రగా దసరా స్పెషల్ బస్సులు సోమవారం స్థానిక డిపో నుంచి పంపినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. రావులపాలెం నుంచి మైసూరు 8రోజుల యాత్రకు రెండు స్పెషల్ బస్సులు బయలుదేరాయన్నారు. రావులపాలెం నుంచి బయలుదేరి శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, హంపి, గోకర్ణం, మురుడేశ్వర్, కొల్లూరుమూకాంబిక, ఉడిపి, శృంగేరి, హొర్నాడు, ధర్మస్థల కుక్కే సుబ్రహ్మణ్యం, బేలూరు, హలేబీడు, శ్రీరంగపట్నం, మైసూరు, కోటిలింగాలు, అరుణాచలం, శ్రీ కాళహస్తి క్షేత్రాల దర్శనం అనంతరం 15న రావులపాలెం చేరుతుందన్నారు.

నేటి నుంచి ప్రత్యేక రైలు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని కాకినాడ నుంచి 8, 10, 12 తేదీల్లో ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్టు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. 07071 రైలు కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి, 9.22కు సామర్లకోట వస్తుందన్నారు. మరుసటి రోజు ఉదయం 8.30కి సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. 9,11 తేదీల్లో 07072 రైలు సాయంత్రం 6.15కు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుందని తెలిపారు.

నేడు స్టార్టప్ ఫెస్ట్-24

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): సుబుకోటా ఫౌండేషన్, జేఎన్‌టీయూకే సంయుక్తంగా జేఎన్‌టీయూకే ఆడిటోరియంలో మంగళవారం స్టార్టప్ ఫెస్ట్-24 నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ మురళీకృష్ణతో పాటు, ఫౌండేషన్ సీఈఓ సుబుకోటా హాజరవుతారు. ఈ ఫెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.

తమ్ముళ్ల కుమ్ములాట

- పి.గన్నవరం టీడీపీలో ఆధిపత్య ముసలం
- సీనియర్ నేతల మధ్య తీవ్రమైన యుద్ధం
- రాజప్పకు వ్యతిరేకంగా రాంబాబు వర్గీయుల ధర్నా
- రాంబాబును ఇన్‌చార్జిగా తొలగించాలని రాజప్ప వర్గం పట్టు
- సామాజిక మాధ్యమాల్లో ఒకరిపై ఒకరు పోస్టింగ్‌లు
- పి.గన్నవరం తొలి నుంచి తలనొప్పే
- ఒకవైపు పట్టించుకోని జనసేన ఎమ్మెల్యే
- మరోవైపు పట్టని అధిష్టానం
- అధికారం వచ్చినా క్యాడర్‌లో నిరుత్సాహమే



అంబాజీపేట మండలం నందంపూడిలో రాంబాబును పార్టీ పదవి నుంచి తప్పించాలని నినాదాలు చేస్తున్న రాజప్ప అనుకూల వర్గీయులు



మగటపల్లిలో రాజప్పకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న టీడీపీలోని నామన రాంబాబు వర్గం

సాక్షి, అమలాపురం: సీనియర్ నేతల మధ్య నెలకొన్న విభేదాలతో పి.గన్నవరం టీడీపీ బజారున పడింది. ఒకరిపై మరొక వర్గానికి చెందినవారు సామాజిక మాధ్యమాలలో విమర్శలు చేసుకోవడం.. ధర్నాలు.. అసంతృప్తి సమావేశాలతో టీడీపీలో రచ్చరచ్చ అవుతోంది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి ముసలం తెస్తోంది.

పి.గన్నవరం నియోజకవర్గం కేంద్రంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు, జెడ్పీ మాజీ చైర్మన్, నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. తొలి నుంచి టీడీపీలో ఉన్న వీరు సమకాలికులు. ఒకప్పుడు ఈ నేతలిద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని తిరిగినవారే. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇద్దరి మధ్య విభేదాలు పొడచూపాయి. ముఖ్యంగా మామిడికుదురు మండలం మగటపల్లిలో ఒక రైతుకు, దుకాణదారుడికి మధ్య నెలకొన్న కేసుల విషయంలో చెరో వైపు నిలిచి ఒకరిపై ఒకరు పై చేయి కోసం రాజకీయాలు మొదలు పెట్టారు. దీనిలో భాగంగా చినరాజప్ప పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని మగటపల్లి, పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు వారం రోజుల క్రితం ఆ గ్రామంలో ధర్నా చేసి, రాజప్పకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనితో విభేదాలు తారస్థాయికి చేరాయి. అప్పటి నుంచి పార్టీలో ఇద్దరి నాయకుల వర్గాల మధ్య సోషల్ మీడియా వేదికగా విమర్శలు పెరిగాయి. నామన రాంబాబు స్వగ్రామం మగటపల్లి. ఇది మామిడికుదురు మండలంలోనిదే అయినా రాజోలు నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. పక్క నియోజకవర్గానికి చెందినవారికి పి.గన్నవరంలో పెత్తనం ఏమిటనే ప్రశ్న లేవనెత్తారు. తక్షణం అతనిని పదవి నుంచి తప్పించాలని సామాజిక మాధ్యమాలలో పోస్టింగ్‌లు పెట్టిస్తున్నారు. పి.గన్నవరం మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పడాల సూపర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకత్వం రాంబాబుపై తిరుగుబాటు జెండా ఎగురవేసింది.

పార్టీ పరువుకు భంగం

నామన నాయకత్వాన్ని ధిక్కరించడంలో భాగంగా అంబాజీపేటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. మండలంలో పార్టీకి చెందిన కీలక నాయకుడిపై రాంబాబు అనుచిత వ్యాఖ్యలు చేసిన నాటి నుంచి పార్టీలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మండలంలోని నందంపూడిలో సమావేశం ఏర్పాటు చేసి ఏకంగా నామన రాంబాబును తొలగించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అయినవిల్లిలో సైతం రాంబాబును తొలగించాలని తీర్మానించారని, తాము కూడా అదే కోరుతున్నామన్నారు. రాంబాబుకు వ్యతిరేకంగా వరుసగా జరుగుతున్న సోషల్ మీడియా దాడి, ఆయా మండలాల నాయకుల అసంతృప్తి సమావేశాల వెనుక రాజప్ప ప్రోద్బలం ఉందనే



నిమ్మకాయల చినరాజప్ప — నామన రాంబాబు

ప్రచారం జరుగుతోంది. సీనియర్ నాయకులు ఇద్దరి తీరు వల్ల పి.గన్నవరంలో టీడీపీ పరువు బజారున పడుతోందని క్యాడర్ అంటోంది. దీనిపై అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకునేవారు లేకుండా పోయారని వారు ఆవేదన చెందుతున్నారు.

పార్టీకి ఇన్‌చార్జి లేని దుస్థితి


పి.గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి 2019 నుంచి ఇదే విధంగా ఉంది. అప్పటి ఎన్నికల్లో సిటింగ్‌ను కాదని నేలపూడి స్టాలిన్‌బాబుకు సీటు ఇచ్చారు. సొంత పార్టీ నాయకులు వెన్నుపోటు పొడవంతో ఆయన ఎన్నికలు ముగిసిన వెంటనే ఆ పార్టీని వదిలేశారు. నాటి నుంచి నేటి వరకు ఇన్‌చార్జి లేరు. త్రిమెన్ కమిటీ, ఎన్నికల కన్వీనర్ పదవులతో పార్టీని నడుపుకుంటూ వస్తున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పార్టీ తరపున తొలుత మహాసేన రాజేష్‌ను అభ్యర్థిగా నిర్ణయించారు. అతనిపై టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి వ్యతిరేకత రావడంతో తప్పించారు. అభ్యర్థి లేక ఈ సీటు జనసేనకు కేటాయించారు. జనసేన పార్టీ నుంచి పోటీ చేసిన గిడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిచినా ఇక్కడ టీడీపీ నేతలకు పెద్దగా ఒరిగింది లేదు. సొంత పార్టీ నాయకులనే పెద్దగా పరిగణనలోకి తీసుకోని గిడ్డి తమనేమి పట్టించుకుంటారని టీడీపీ క్యాడర్ అంటోంది. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నేతల ఆధిపత్య పోరుతో తెలుగు తమ్ముళ్లు మధనపడుతున్నారు.

'మోకా'పై మండిపడుతున్న జనసేన

అగ్నికి ఆజ్యం పోసినట్టు టీడీపీకి చెందిన మరో నాయకుడు, ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సభ్యుడు మోకా ఆనంద్‌సాగర్ సోషల్ మీడియా వేదికగా పెట్టిన పోస్టింగ్ వివాదాస్పదమైంది. తనకు పదవి రావడానికి కారణం టీడీపీనే అన్నట్టుగా ఆయన వీడియో పోస్టింగ్ పెట్టారు. దీనిపై జనసేన నేతలు మండిపడుతున్నారు. కూటమిలో పార్టీలకు కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి టీడీపీ పార్టీ క్యాడర్‌కు మాత్రమే కృతజ్ఞతలు చెబుతారా? ఇదేనా మీ కృతజ్ఞతాభావం అని చెలరేగిపోతున్నారు. రాష్ట్రంలో టీడీపీ తనకు తానుగా అధికారంలోకి రాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శలు సంధిస్తున్నారు. ఒకవైపు టీడీపీలో గ్రూపు తగాదాలు.. మరోవైపు టీడీపీ, జనసేన మధ్య మాటల యుద్ధం పి.గన్నవరం రాజకీయాలను కాకపుట్టిస్తున్నాయి.



రాంబాబు రాజీనామా చేయాలని సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ప్రచారం



మోకా ఆనంద సాగర్‌కు వ్యతిరేకంగా జనసేన సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలు

ధాన్యం సేకరణకు సిద్ధం

– అధికారులకు జేసీ ఆదేశం

అమలాపురం రూరల్: ధాన్యం సేకరణ ప్రక్రియ నిర్వహించడానికి అధికారులు సిద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమ కోసం ప్రభుత్వం మద్దతు ధర ప్రవేశపెట్టిందని చెప్పారు. రైతులకు నష్టం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. అక్రమాలు, పొరపాట్లు, తప్పులు జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. నవంబర్ మొదటి వారంలో ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 4.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వచ్చే అవకాశం ఉందని అంచనాల ప్రకారం తెలుస్తోందన్నారు. ప్రస్తుతం రైతులకు మద్దతు ధర కల్పించడానికి ముందస్తు చర్యలు తీసుకుకోవాలని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం సేకరించడానికి తేమ యంత్రాలు, బరువు తూచే వేయింగ్ కాటా సిద్ధం చేయాలని చెప్పారు. అవసరాల మేరకు గోనె సంచులు సిద్ధంగా ఉంచుకోవాలని కొరత అనే మాట వినపడకూడదని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించు కునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. కొనుగోలు చేసిన 48 గంటలలో ధాన్యం సొమ్ము రైతు ఖాతాకు జమవుతుందని, రవాణా చార్జీలు వారం లోపు జమవుతాయని ఆమె తెలిపారు. డీఆర్‌ఓ ఎం. వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ ఉదయభాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, డీసీ ఓ మురళీకృష్ణ, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్, జిల్లా మార్కెటింగ్ ఏడీ విశాలాక్షి, డీటీఓ డి. శ్రీనివాసరావు సివిల్ సప్లయ్ సహాయ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

మద్యం షాపులకు 3,500 దరఖాస్తులు రావచ్చు

కొత్తపేట: నూతన మద్యం పాలసీ కింద జిల్లాలోని 133 షాపులకు సుమారు 3,500 దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కాత్యాయని, ఎస్ఐలు, సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా సర్కిల్ పరిధిలో ఇంతవరకూ ఎన్ని మద్యం దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఆఫ్‌లైన్ ఎన్ని? ఆన్‌లైన్ ఎన్ని? అని ఆరా తీశారు. నూతన పాలసీలో విధి విధానాలు తదితర అంశాలపై దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తి చేసి, వారికి సహకరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్స్ పరిధిలో గత మద్యం పాలసీలో 150 మద్యం షాపులు కాగా ప్రస్తుత పాలసీలో 133 షాపులను మండలం, మున్సిపాలిటీ యూనిట్స్‌గా నిర్ణయించినట్టు తెలిపారు. ఆదివారం రాత్రి వరకూ 311 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ విధానాల్లో దరఖాస్తులు చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. సరైన వ్యాపారాలు లేకపోవడం, ఉన్న వ్యాపారాలు అంతగా రాణించకపోవడంతో ప్రస్తుత మద్యం పాలసీలో మద్యం వ్యాపారంపై చాలామంది మక్కువ చూపుతున్నారని తెలిపారు. ఆ మేరకు సుమారు 3,500 దరఖాస్తులు రావచ్చునని తెలిపారు. దరఖాస్తులకు గడువు ఈ నెల 9 వరకూ మాత్రమే అన్న విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. 11న అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో దరఖాస్తులను డ్రా తీస్తామని తెలిపారు. ఒక వ్యక్తికి ఎన్ని లైసెన్స్‌లైనా ఇస్తామన్నారు. స్థానికులు స్థానిక షాపులకే కాక స్థానికేతర షాపులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెండు సంవత్సరాల కాలపరిమితికి లైసెన్స్ ఇస్తారని, రెండో ఏడాది 10 శాతం అదనంగా ఫీజు చెల్లించవలసి ఉంటుందన్నారు. గతంలో లైసెన్స్ ఫీజు మొత్తం ఏడాదికి మూడు వాయిదాల్లో చెల్లించగా ఈసారి ఆరు వాయిదాల్లో చెల్లించే సౌకర్యం ఉందన్నారు. గీత కార్మికులకు షాపుల కేటాయింపు విషయం ప్రభుత్వ దృష్టిలో ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్

సమస్యల పరిష్కారానికి చర్యలు



జిల్లా కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



అర్జీ అందించిన వ్యక్తులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

మండపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపడుతుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. సోమవారం మండపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి నేరుగా ఆయన వినతులు స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఏపీసీసీ సభ్యుడు కామన ప్రభాకర రావు మండపేట - ఏడిద, దుళ్ల రహదారి అధ్వానంగా వుందని కలెక్టర్‌కు వివరించారు. పదేళ్లుగా ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయిందని, ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మండపేట - జొన్నాడ రోడ్డు సమస్యపై కూడా ఆయన వినతి పత్రం అందించారు. మండపేటలో శ్మశాన వాటికకు స్థలం ఇప్పించాలని ముస్లింలు వినతి పత్రం అందజేశారు. ఒక కాల్‌మనీ వ్యాపారి వేధింపులు తాళలేక పోతున్నామని తమకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రోడ్ల కోసం, గ్రామాల్లో డంపింగ్ యార్డు సమస్యపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయని చెప్పారు. చెత్తను రోడ్లపై తగులబెట్టడంతో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు అందాయన్నారు. రోడ్ల మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 119 అర్జీలు అందాయని ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. రామచంద్రపురం ఆర్డీవో కతీబ్ కౌశర్ భానో, తహసీల్దార్ తేజేశ్వరరావు, ప్రత్యేక అధికారి ఓ రామకృష్ణ, డీఎల్‌పీవో ఐదం రాజు, డిప్యూటీ తహసీల్దార్ మెహెర్‌బాబా పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 40 అర్జీలు

అమలాపురం టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 40 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎలు ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు వచ్చి తమ అర్జీలు అందించారు. వచ్చిన 40 అర్జీల్లో ఆస్తి వివాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించినవే ఉండడంతో ఎస్పీ వారితో దాదాపు కౌన్సెలింగ్ మాదిరిగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్సైలతో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాల స్థాయిలో వృత్తి విద్య

- పీఎంశ్రీ పాఠశాలల్లో అమలు
- ప్రతి స్కూలులో కనీసం రెండు వృత్తి విద్యా కోర్సులు
- 9,10 తరగతుల విద్యార్థులకు క్షేత్ర స్థాయి సందర్శనలు

రాయవరం: పాఠశాల స్థాయిలో వృత్తి విద్యా కోర్సుల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పాఠశాలల్లో వృత్తి విద్యను అమలు చేస్తున్నారు. విద్యార్థి కేంద్రంగా బోధన చేసే చర్యల్లో భాగంగా వృత్తి విద్యను అమలు చేస్తున్నారు. పాఠశాల దశలో ప్రారంభమై కళాశాల విద్య ముగిసే సమయానికి విద్యార్థులు వారి కాళ్లపై వారు నిలబడేందుకు పలు విప్లవాత్మక, వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు కళాశాల నుంచి బయటకు వెళ్లేటప్పటికి వారి కాళ్లపై వారు నిలబడే విధంగా పథకాలను అమలు చేస్తున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా పాఠశాల స్థాయిలోనే వత్తి విద్యా బోధన చేపట్టేందుకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వనున్నాయని పలువురు భావిస్తున్నారు.

ఉపాధి గ్యారంటీ కోర్సులు

పదో తరగతి పూర్తయ్యే నాటికి ప్రతి విద్యార్థి కనీసం రెండు కోర్సుల్లో నైపుణ్యం సాధించేలా పాఠ్య ప్రణాళికను అమలు చేస్తున్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో కేంద్రం ఈ వృత్తి విద్యా కోర్సులను 2023లో ప్రారంభించగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఎంపిక చేసిన రెండు కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఎంపిక చేసిన కోర్సులకు సంబంధించిన ఇన్‌స్ట్రక్టర్లను కూడా నియమించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో అధిక శాతం వృత్తి విద్యా కోర్సులను ఎంపిక చేసుకుంటున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర ఉపాధి గ్యారంటీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థులను ముందస్తుగా సన్నద్ధం చేసే క్రమంలో భాగంగా పాఠశాల స్థాయిలో వృత్తి విద్యాబోధన అమలుకు నిర్ణయించింది. పని అనుభవం, ఉత్పాదకత పెంచే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడం, వివిధ రకాల వస్తువుల తయారీకి అవసరమైన పరికరాలు, యంత్రాలను గుర్తించడం, వాటిని ఎలా ఉపయోగించాలనేది విద్యార్థులకు నేర్పిస్తారు. చేతి పనులు చేయటంలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించడం, విద్యార్థుల్లో పరస్పర సహకారం, టీమ్ వర్క్‌ను విద్యార్థులకు అలవాటు చేస్తారు.

అమలవుతున్న కోర్సులివీ..

అగ్రికల్చర్, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఐటీ-ఐటీఈఎస్, బ్యూటిఫికేషన్ అండ్ వెల్‌నెస్, రిటైల్, అప్పారెల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులకు అమలు చేస్తున్నారు. ప్రతి పీఎంశ్రీ పాఠశాలలో ఎంపిక చేసిన రెండు కోర్సులను విద్యార్థులకు నేర్పిస్తున్నారు. ప్రతి రోజు ఒక పీరియడ్‌ను విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు నేర్పించేందుకు కేటాయిస్తున్నారు.



వృత్తి విద్యా కోర్సుల అభ్యసనలో భాగంగా విద్యార్థుల క్షేత్ర స్థాయి సందర్శన



పరిశ్రమలో యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న విద్యార్థులు


క్షేత్ర స్థాయి సందర్శనలు

వృత్తి విద్యా కోర్సులు నేర్పించడంతో పాటు పాఠశాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు, ప్రధానంగా చేతి వృత్తుల కేంద్రాల సందర్శనకు విద్యార్థులను ఫీల్డ్ విజిట్లకు తీసుకుని వెళ్తున్నారు. స్థానిక చేతి వృత్తుల నిపుణులను పాఠశాలలకు రప్పించి, వారితో విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం కూడా వృత్తి విద్యా కోర్సుల్లో ఒక భాగం. చేతి వృత్తుల, పరిశ్రమల నిర్వహణదారులతో ముఖాముఖీ ఏర్పాటు చేస్తారు. తద్వారా 9–12 తరగతులు చదివే సమయానికి వృత్తి విద్యలో అనుభవం వచ్చేలా విద్యార్థులను సమాయత్త పరుస్తారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

వృత్తి విద్యా కోర్సులు అమలవుతున్న పీఎంశ్రీ పాఠశాలలివీ..

1. జెడ్పీహెచ్‌ఎస్, సిరిపల్లి, అయినవిల్లి మండలం. 2. జెడ్పీహెచ్‌ఎస్, మూలస్థానం, ఆలమూరు మండలం. 3. జెడ్పీహెచ్‌ఎస్, దేవగుప్తం, అల్లవరం మండలం. 4. జెడ్పీహెచ్‌ఎస్, అంబాజీపేట. 5. జెడ్పీహెచ్‌ఎస్, పేరవరం, ఆత్రేయపురం మండలం. 6. జెడ్పీహెచ్‌ఎస్, మాచర, కపిలేశ్వరపురం మండలం. 7. జెడ్పీహెచ్‌ఎస్, కాట్రేనికోన. 8. జెడ్పీహెచ్‌ఎస్(బాలికలు), కొత్తపేట, 9. జెడ్పీహెచ్‌స్, బట్టేలంక, మలికిపురం మండలం. 10. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అనాతవరం, ముమ్మిడివరం మండలం. 11. జెడ్పీహెచ్‌ఎస్, మామిడికుదురు. 12. జెడ్పీహెచ్‌ఎస్, తాపేశ్వరం, మండపేట మండలం. 13. జెడ్పీహెచ్‌ఎస్, పాత గన్నవరం. 14. జెడ్పీహెచ్‌ఎస్, హసన్‌బాద, రామచంద్రపురం మండలం. 15. జెడ్పీహెచ్‌ఎస్, వెదిరేశ్వరం, రావులపాలెం మండలం. 16. జెడ్పీహెచ్‌ఎస్, రాయవరం. 17. జెడ్పీహెచ్‌ఎస్, కడలి, రాజోలు మండలం. 18. జెడ్పీహెచ్‌ఎస్, రామేశ్వరం, సఖినేటిపల్లి మండలం. 19. జెడ్పీహెచ్‌ఎస్, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం. 20. జెడ్పీహెచ్‌ఎస్, ఐ.పోలవరం. ఈ పాఠశాలలతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే జెడ్పీహెచ్‌ఎస్, చెముడులంక, ఆలమూరు మండలం, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఐఈఎస్(బాలురు), గోడి, అల్లవరం మండలం. ఏపీఆర్‌ఈఎస్(బాలురు), సమనస, అమలాపురం మండలం పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించింది.

ప్రత్యేక సిలబస్‌ను అనుసరిస్తున్నారు



రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎంపిక చేసిన పాఠశాలలతో పాటుగా, పీఎంశ్రీ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులను అమలు చేస్తున్నాం. వృత్తి విద్యకు ప్రత్యేక సిలబస్‌ను అనుసరిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యను పరిచయం చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం అలవడుతుంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

క్లుప్తంగా

డీజిల్‌తో రెండు వాహనాల సీజ్


గోవలంక ఏటిగట్టు రహదారిలో సీజ్ చేసిన డీజిల్ వాహనాలతో అధికారులు

తాళ్లరేవు: యానాం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఏటిగట్టు రహదారిలో తరలిస్తున్న 5,400 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోలీసు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించగా, యానాం నుంచి ద్రాక్షారామకు 3 వేల లీటర్ల డీజిల్‌తో వెళుతున్న బొలేరో వాహనాన్ని గోవలంక కనకదుర్గమ్మ ఆలయం వద్ద పట్టుకున్నామన్నారు. అదేవిధంగా అరటికాయలంక వద్ద నిర్వహించిన తనిఖీల్లో యానాం నుంచి రావులపాలేనికి బొలెరో వాహనంలో తరలిస్తున్న 2,400 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని డీజిల్‌తోపాటు వాహనాలను సీజ్ చేశామన్నారు. అక్రమ తరలింపుదారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డీజిల్‌ను తదుపరి చర్యల నిమిత్తం పౌరసరఫరాల శాఖకు అప్పగించామని అన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

అంబాజీపేట: ఓ యువతి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అంబాజీపేట పోలీసులు తెలిపారు. కె.పెదపూడికి చెందిన యువతి (20) ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆమె తాతయ్య కుడుపూడి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. చుట్టుపక్కల, బంధువులు ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సూర్యనారాయణ వివరించారు.

బంగారు ఆభరణాల చోరీ

తుని: ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళ మెడలోని నుంచి బంగారు ఆభరణాలను ఇద్దరు యువకులు లాక్కొని పరారయ్యారు. ఆ వివరాల్లోకెళితే.. తుని మండలం వెలమకొత్తూరుకు చెందిన వివాహిత కర్రి లక్ష్మి దుస్తులు కొనుగోలు చేసేందుకు తుని వచ్చింది. తునిలో వాణీ ఫ్యాన్సీ స్టోర్ వీధిలో నడిచి వెళ్తుంటుండగా ఒక యువకుడు నడుచుకుంటూ, మరో యువకుడు మోటారు సైకిల్‌పై వచ్చారు. నడుచుకుంటూ వచ్చిన యువకుడు కర్రి లక్ష్మి దగ్గరకు వచ్చి మెడలో ఉన్న బంగారు తాడు, బంగారు నల్లపూసల తాడును లాక్కొని బైక్‌పై పరారయ్యారు. అపహరణకు గురైన ఆభరణాలు నాలుగు కాసులు ఉంటాయని కర్రి లక్ష్మి పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు.

మూషికాలతో ముప్పు



- పిలక దశలో వరి పైరు
- పంటలను దెబ్బతీస్తున్న ఎలుకలు
- ఏటా ఖరీఫ్‌లో తీవ్ర నష్టం

కాకినాడ సిటీ: మూషికాలు అన్నదాతను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తీపిగా ఉండే దుబ్బు, పిలకలను మూషికాలు తినేస్తూ దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. మూషికాల బారి నుంచి వరి పైరును ఎలా సంరక్షించుకోవాలో వ్యవసాయ అధికారి విజయకుమార్ వివరించారు. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 93 వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఇందులో ప్రధానంగా స్వర్ణ, సాంబమసూరి రకాలకు చెందిన వరి పంటను మాత్రమే వేశారు. వర్షాభావ పరిస్థితి కారణంగా ఆగస్టు చివరి నాటికి ఊడ్పులు పూర్తి చేశారు. చాలాచోట్ల వెదజల్లు పద్ధతి అవలంబించడంతో అవి వేగంగా పెరిగి దుబ్బు కట్టే దశకు చేరుకున్నాయి. పిలకలు పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి బొరియల్లోకి తీసుకెళ్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ఎలుకలను నివారించే వ్యవస్థ లేకపోవడంతో రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఎలుకలను సామూహికంగా నివారించేందుకు ప్రభుత్వం ఎలుకలు పట్టే బుట్టలు గాని, బ్రోమోడయోలిన్ మందును గానీ వ్యవసాయ శాఖ పంపిణీ చేయాలి. నేటికీ జిల్లాలో ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

నివారణకు ఏం చేయాలంటే..

- గ్రామంలోని రైతులంతా కలసి ఓ యూనిట్‌గా ఏర్పడి సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి.
- సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ రెండు శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలను పొందవచ్చు.
- బ్రోమోడయాలిన్ 0.25 మిల్లీలీటర్ల ఎలుకల మందు రెండు శాతం విషపు ఎరగా తయారీ చేసుకోవడం కోసం 96 పాళ్ల నూకలు, రెండు గ్రాముల నూనె, రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందును కలిపాలి.
- విషపు ఎర తయారు చేసే సమయంలో చేతులకు గ్లౌజులు లేదా పాలిథిన్ సంచి తొడుక్కోవాలి. లేదంటే మందులో ఉండే మనిషి చేతి వాసనను ఎలుక పసిగట్టి ఎరను స్వీకరించదు.
- ఒక్కో సజీవ ఎలుక బొరియకు 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి ఎలుక బొరియల్లో అంగుళం లోపల పెట్టాలి. పొట్లాలు అమర్చిన అనంతరం బొరియను మూసి వేయకూడదు.
- భారీ, మోస్తరు వర్షం గానీ వస్తే వర్షం ఆగే వరకూ చూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేయాలి. ఎర మందు వర్షంలో తడిస్తే సరిగా పని చేయదు.
- కలిపిన ఎర మందు 12 గంటలు దాటితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టి ఈ విశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రం లోపు అమర్చాలి. ఎలుకలు నిశాచరులు కాబట్టి సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ స్వీకరించే అవకాశం ఉంది.
- మందు తిన్న నాలుగు నుంచి ఐదు రోజులకు ఎలుక చనిపోతుంది. ఈ మందు తిన్న ఎలుకల రక్తం గడ్డ కట్టదు. అవి రక్తస్రావమై రక్తహీనతతో చనిపోతాయి. అందువల్ల ఎలుకల బొరియల సంఖ్య నమోదు చేయాలంటే మందు అమర్చిన 7 నుంచి 10 రోజుల తరువాత చేయాలి.

పొగ పెట్టాలి

పొగబారించే యంత్రం (బర్రోఫ్యూమి గేటర్)తో ఎలుక బొరియలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాలు పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి, పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. తొలకరి చినుకుల అనంతరం పంట భూమిని దుక్కి చేయాలి. రైతులు పొలం గట్లపై కాకుండా పోరంబోకు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విషపు ఎరను పెట్టి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి. ఎలుక బొరియలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.


ఎలుక కొట్టుడుకు గురవుతున్న వరి పొలం


ఎలుకల నివారణకు సిద్ధం చేసిన బుట్టలు

ఎన్నో పద్ధతులు ఉన్నాయి..



మూషికాలతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతోంది. రాష్ట్రంలో ఏటా 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను అన్నదాతలు నష్టపోతున్నారు. రైతులు దీనిపై దృష్టి సారించి సామూహికంగా ఎలుకలను నిర్మూలించేందుకు ముందుకు రావాలి. ఇందుకు ఎన్నో పద్ధతులు ఉన్నాయి. విషపు ఎరలు పెట్టడంతో పాటు ట్రాప్‌లు, పొగబారించే పద్ధతులు అవలంబించాలి.

– ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

రైతులు దృష్టి పెట్టాలి



రైతులు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలుకలను నివారించుకోవాలి. వరి దుబ్బులు తీపిగా ఉండడంతో పొట్ట దశలోనే ఎలుకలు వీటిని కొరికి రైతులకు నష్టం కలిగిస్తాయి. బొరియలను గుర్తించి అందులో విషపు ఎరలు, ట్రాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎలుకల బుట్టలను సైతం ఉంచితే అవి చిక్కి పొలాల్లోకి వెళ్లవు. ఇది రైతులంతా సామూహికంగా చేపట్టాలి.

–ఏవీ రాజేష్, కరప మండల వ్యవసాయ అధికారి

వ్యక్తి మృతదేహం లభ్యం

కాకినాడ క్రైం: స్థానిక కొండయ్యపాలెం కొత్త వంతెన కింద సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టూ టౌన్ పోలీసులు తెలిపారు. సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం పాడైన స్థితిలో ఉందన్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామన్నారు.

ఏఎన్‌ఎంకు తీవ్ర గాయాలు

ముమ్మిడివరం: స్కూటీపై విధులకు వెళ్తున్న ఏఎన్‌ఎంను వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో ఆమెతోపాటు ఓ బాలిక తీవ్రంగా గాయపడ్డారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లికి చెందిన ఏఎన్‌ఎం మొల్లి మంగాయమ్మ సోమవారం స్కూటీపై ఐదేళ్ల జాను అనే పాపతో కలసి కొమానపల్లి హెల్త్ సెంటర్‌కు వెళ్తుండగా పల్లిపాలెం సెంటర్‌లో వెనుక నుంచి ఆటో ఢీకొంది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అహోరాత్ర పారాయణ

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని అహోరాత్ర పారాయణ మంగళవారం నిర్వహించనున్నారు. స్థానిక లలితా భక్త మండలి ఆధ్వర్యంలో ద్వితీయ అహోరాత్ర లలిత సహస్రనామ పారాయణ నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున కలశ స్థాపనతో ప్రారంభమై మహిళలతో 24 గంటల పాటు లలితా పారాయణ జరుగుతుందన్నారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా తలపెట్టిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, భక్తులు అందరూ పాల్గొనాలని అన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి


పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

రాజమహేంద్రవరం రూరల్: ఈపీఎఫ్–95 పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు ఇవ్వాలని ఏపీ రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సోమేశ్వరరావు, సీహెచ్ మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఏపీ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు జిల్లాల సభ్యులు ధర్నా చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమేశ్వరరావు, మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీఆర్‌పీఏ రాష్ట్ర నాయకుడు కె.సత్తిరాజు, సీఐటీయూ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్ని సార్లు అడిగినా పెన్షన్ పెంచడం లేదన్నారు. చాలీచాలని పెన్షన్‌తో వృద్ధాప్యంలో బతకడం చాలా కష్టమని, పెరుగుతున్న ధరలకు ఈ పెన్షన్‌కు పొంతనే లేదని అన్నారు. వీటన్నింటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి చనిపోయిన పెన్షనర్ల కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని, లేదంటే భవిష్యత్‌లో తమ పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కనీస డీఏ ఇవ్వాలని, హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, రైల్వే ప్రయాణంలో రాయితీ పునరుద్ధరించాలని, భార్యాభర్తల ఇద్దరికీ వైద్య సదుపాయం కల్పించాలని తదితర కోరారు. అనంతరం పీఎఫ్ రీజినల్ కమిషనర్ మనోజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు కేఎస్‌వీ రామచంద్రరావు, బి.పూర్ణిమ రాజు, అజయ్ కుమార్, రామదాసు, కృష్ణారావు, ప్రభాకర్, వివిధ జిల్లాల పెన్షనర్లు పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులు ఉంటే అన్నీ శుభాలే

- రజత కవచాలంకృత అవతారంలో విజయదుర్గమ్మ
- భక్తులతో కిటకిటలాడిన విజయదుర్గా పీఠం


పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: అమ్మ ఆశీస్సులుంటే అన్నీ శుభాలే కలుగుతాయని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) భక్తులకు ఉద్బోధించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం గాడ్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంచి కార్యక్రమానికి దైవ ఆశీస్సులు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయన్నారు. ఆధ్యాత్మికవేత్తలు తాతా సందీప్‌శర్మ, శతావధాని శరత్‌చంద్రలు ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ భగవంతుడికి భక్తులకు గురువులు అనుసంధానకర్తలుగా ఉంటారన్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారి అవతారాలు, అమ్మవారి ఏఏ అవతారాల్లో రాక్షస సంహారం ఏ విధంగా జరిగిందనే విషయాన్ని భక్తులకు వివరించారు. విజయదుర్గా అమ్మవారు రజత కవచ అలంకృత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠ బ్రహ్మ శివ, అర్చకులు చీమలకొండ వీరావధాని, తోలేటి నాగేంద్రశర్మ, చక్రవర్తుల మాధవాచార్యుల అర్చకత్వంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఏకవార రుద్రాభిషేకం, గాయత్రి అష్టోత్తరంతో కుంకుమ పూజలు, నవగ్రహ హోమం జరిపారు. పీఠంలో భక్తులు కలశాలు ఏర్పాటు చేసుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు దంపతులు పీఠంలో పూజలు చేసి, పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. మండలంలోని రాయవరం, వెదురుపాక, మాచవరం, సోమేశ్వరం, లొల్ల, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం, సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు.


అన్నపూర్ణాదేవి అవతారంలో విజయదుర్గమ్మ

అండర్-14 క్రికెట్ జట్టుకు లక్ష్మీనారాయణ ఎంపిక


జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన లక్ష్మీనారాయణ

అంబాజీపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–14 క్రికెట్ జట్టుకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సీహెచ్ లక్ష్మీనారాయణ ఎంపికైనట్లు హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి కడప జిల్లాలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొనున్నాడన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, ఒంగోలు, అనంతపురం జిల్లా జట్లతో తలపడనుందన్నారు. అత్యంత ప్రతిభ కనబర్చిన లక్ష్మీనారాయణ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. లక్ష్మీనారాయణ ఎంపికపై హెచ్ఎం, పీడీలతో పాటు పీఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, క్రికెట్ కోచ్ ఎం.సత్తిబాబు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం



అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో బంగారు పతకం సాధించిన వెంకటహర్ష-నితిన్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకూ నిర్వహించిన ఉగాండా ఇంటర్నేషనల్ సీరిస్–24 బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన వెంకట హర్షరాయుడు ప్రతిభ చాటారు. పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడిన వెంకటహర్ష రాయుడు- నితిన్ జట్టు బంగారు పతకం సాధించింది. హైదరాబాద్‌లోని పుల్లెలగోపీచంద్ అకాడమీలో ఐదేళ్లుగా బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్నారు. హర్ష అచ్చంపేట గ్రామానికి చెందిన వీరంరెడ్డి వసంత రాయుడు ద్వితీయ కుమారుడు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన అతన్ని డీఎస్ఏ బ్యాడ్మింటన్ కోచ్ చిన్నారి అభినందించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు


తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్

నల్లజర్ల: నల్లజర్లకు చెందిన క్లెం దుర్గాప్రసాద్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను ఏలూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఘంటావారిగూడెం హైవేపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతల వైపు రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు సొసైటీలో చోరీకి పాల్పడిన నిందితుడు గుబిల సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.5 వేల నగదు రికవరీ చేశామన్నారు. నిందితుడు ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్ద గొన్నూరు గ్రామానికి చెందిన వాడన్నారు. నేరం జరిగిన 24 గంటల వ్యవధిలోనే చోరీ కేసును పోలీసులు ఛేదించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదాలు


ఎన్.రామేశ్వరంలో అదుపు తప్పి బోల్తా పడిన ఆటో

అల్లవరం: అల్లవరంలో రొయ్యల వేట ముగించుకుని కూలీలతో వెళ్తున్న ఆటో ఎన్.రామేశ్వరం తూము వద్ద సోమవారం సాయంత్రం ప్రమాదానికి గురైంది. ఆటోకి ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే బోదెలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి వేగంగా, దురుసుగా ఆటోకి ఎదురుగా రావడంతో ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు.

బెండపూడి వద్ద..

తొండంగి: జాతీయ రహదారిపై బెండపూడి వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి కారును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ వేగాన్ని గమనించిన కారు డ్రైవర్ కారును చాకచక్యంగా తప్పించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెండర్ల ప్రకటనపై గందరగోళం

యానాం: యానాం ఫలపుష్ప ప్రదర్శన–2025ను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ వివిధ రకాల మొక్కలు సరఫరా చేయాలంటూ చేసిన బహిరంగ ప్రకటన గందరగోళానికి గురిచేయడంతో తాము టెండర్లు వేయలేకపోయామని సోమవారం పలు నర్సరీల యాజమాన్యాలు విలేకరులకు తెలిపారు. గత నెల 25న డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ పేర కొటేషన్ నోటీసును జారీ చేశారు. ఇందులో ఫారెస్టరీ, నర్సరీ మొక్కలు కావాలని అక్టోబర్ 9లోగా టెండర్లు వేయాలని, అదే ఆఖరు తేదీ అని పేర్కొని వివిధ నర్సరీలకు పంపించారు. అయితే మళ్లీ టెండర్ల తేదీకి ఆఖరు తేదీ అక్టోబర్ 7 అని పేర్కొని మార్చిన తేదీని తమకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచారని, దీంతో తామంతా సమయం 9వ తేదీ వరకూ ఉందని భావించి టెండర్లు వేయ లేకపోయామని కడియపులంక గోపిసాయిరామ్ నర్సరీ యజమాని ఈలి గోపాలరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే వ్యవసాయ శాఖ సిబ్బంది మార్చిన తేదీని గోప్యంగా ఉంచారని, ఆ విధంగా తమకు కావాల్సిన వారికి మాత్రమే తెలియజేసి వారితోనే కొటేషన్లు వేయించారని ఆరోపించారు. ఈ ఘటనపై ఆర్‌పీఓ మునిస్వామికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.